సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 7 । ఫిబ్రవరి । 2025



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. గురువారం ఆయన స్పోర్ట్స్‌మీట్‌ను ప్రారంభించారు. 8లో



సమస్యలతో సతమతం!

రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుదుత్పత్తి కర్మాగారాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఇంజనీర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి అధికమవుతుంది. రాత్రి వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక గురువారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నాన్న పాటలు వింటూ పెరిగా..

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల



మాట్లాడుతున్న డాక్టర్ వెన్నెల

భద్రాచలంటౌన్: సమాజాన్ని మేల్కొల్పేందుకు తన తండ్రి గద్దర్ ప్రతి రోజూ పాడే పాటలు వింటూ పెరిగానని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ డాక్టర్ వెన్నెల అన్నారు. భద్రాచలం పట్టణంలో నిర్వహిస్తున్న అంతరాష్ట్ర నాటకోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'గద్దరన్నా' అంటూ అందరూ పిలుచుకునే తన తండ్రి ఆశయ సాధనకు కృషి చేయాని కోరారు. శ్రీరామచంద్రుడు కొలువుదీరిన భద్రాద్రి పుణ్యక్షేత్రంలో కళాభారతి పేరుతో నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు అంతరించిపోతున్న కళలకు జీవం పోస్తున్నాయని చెప్పారు. 23 ఏళ్లుగా ఈ వేడుకలను నిర్వహిస్తూ నాటి కళలను నేటి తరానికి చూపించడం అభినందనీయమని అన్నారు. ముందుగా చిన్నారుల నాట్య ప్రదర్శన, ఆ తర్వాత గుంటూరు అభినయ ఆర్ట్స్ వారు నిర్వహించిన ఇంద్రప్రస్థం నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రముఖ మిమిక్రీ కళాకారుడు రమేష్ ప్రదర్శన అందరినీ కడుపుబ్బా నవ్వించింది. కార్యక్రమంలో భద్రాద్రి కళాభారతి వ్యవస్థాపకుడు అల్లం నాగేశ్వరరావు, తాళ్లూరి పంచాక్షరయ్య, ఆర్టీసీ ఖమ్మం రీజనల్ మేనేజర్ సరిరామ్, భద్రాచలం డీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణలో నకిలీ టీఆర్‌లు

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక సీసీఐ కొనుగోలు కేంద్రంలో విచారణ చేపట్టగా నకిలీ టీఆర్‌లు వెలుగులోకి వచ్చాయి. విజిలెన్స్ అధికారుల సమాచారంతో వ్యవసాయ శాఖ అధికారులు విచారించగా.. వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం లేకుండా ఏఈఓ నకిలీ టీఆర్‌లు ఇచ్చినట్టు నిర్ధారించి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. నకిలీ టీఆర్‌లు ఇచ్చిన ఏఈఓను సస్పెండ్ చేయనున్నట్టు సమాచారం.

మార్గం సుగమం!



జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి చేరుకోవాలంటే ప్రస్తుతం ఖమ్మం – సూర్యాపేట రోడ్డే ప్రధాన మార్గంగా ఉంది. దీనికి ప్రత్యామ్నాయంగా కొత్తగూడెం – హైదరాబాద్ (గౌరెల్లి జంక్షన్) నేషనల్ హైవే–930పీ ని 2021లో గెజిట్‌లో ప్రకటించారు. కొత్తగూడెం నుంచి ఇల్లెందు – మహబూబాబాద్ – తొర్రూరు మీదుగా హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డులో గౌరెల్లి జంక్షన్ వరకు ఈ రహదారి ఉంటుంది. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొత్తగూడెం – హైదరాబాద్ మధ్య 40 కి.మీ. వరకు దూరం తగ్గుతుంది. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఎన్‌హెచ్ - 930 పీ లో కీలక అడుగులు

- కొత్తగూడెం – ఇల్లెందు రోడ్డు విస్తరణ
- 2021లో జాతీయ రహదారిగా మార్పు
- జిల్లాలో 52 కి.మీ.మేర రోడ్డు నిర్మాణం
- కొత్తగూడెం – హైదరాబాద్ మధ్య తగ్గనున్న దూరం

రెండేళ్ల క్రితమే మార్కింగ్

ఎన్‌హెచ్ –930పీ లో ఇల్లెందు – కొత్తగూడెం మధ్య మార్గాన్ని జాతీయ రహదారుల సంస్థ కీలకంగా గుర్తించింది. గౌరెల్లి జంక్షన్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. జిల్లా సరిహద్దు గ్రామమైన నెహ్రూనగర్ వరకు రెండు వరుసల రహదారిగా ఉంటుంది. అక్కడి నుంచి ఇల్లెందు బైపాస్, బొజ్జాయిగూడెం – టేకులపల్లి – ఇల్లెందు క్రాస్‌రోడ్ వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని నిర్ణయించారు. స్థానిక పరిశ్రమలకు చెందిన లారీలు ఈ మార్గంలో ఎక్కువగా ప్రయాణిస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. రోడ్డును ఏ మేరకు విస్తరించాలనే అంశంపై 2022 చివరి నాటికే సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. మార్గ మధ్యంలో ప్రైవేటు, ప్రభుత్వ, అటవీ శాఖ భూములను సేకరించాల్సి ఉంది.

భూసేకరణ షురూ..

ఎన్‌హెచ్ 930పీ జాతీయ రహదారి జిల్లా పరిధిలో ఇల్లెందు మండలం నెహ్రూనగర్ దగ్గర మొదలవుతుంది. అక్కడి నుంచి ఇల్లెందు సమీపంలోని ఉసిరికాయపల్లి వద్ద బైపాస్ రోడ్డు ప్రారంభమై ఇల్లెందు – ఖమ్మం రోడ్డు మీదుగా బొజ్జాయిగూడెం దగ్గర ఇల్లెందు – కొత్తగూడెం రోడ్డును కలుస్తుంది.

రూ.700 కోట్ల వ్యయంతో..

కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్డు నుంచి టేకులపల్లి మీదుగా ఇల్లెందు బైపాస్, నెహ్రూనగర్ వరకు 52 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.700 కోట్ల వరకు వ్యయం అవుతుందనే అంచనాతో డీపీఆర్ సిద్ధం చేశారు. రెవెన్యూ శాఖ నుంచి భూ సేకరణ ప్రక్రియ పూర్తయితే నిర్మాణ పనులకు టెండర్లు పిలిచే యోచనలో ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు. జిల్లాకు చెందిన వాహనాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా వాహనాలు సైతం జిల్లా మీదుగానే హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. దీంతో కొత్తగూడెం – వైరా – ఖమ్మం మార్గంలో వాహనాల రద్దీ కిక్కిరిసిపోతోంది. ఈ మార్గంలో వేగంగా ప్రయాణించడం కష్టంగా మారింది. ఎన్‌హెచ్ 930పీ అందుబాటులోకి వస్తే తక్కువ సమయంలో రాష్ట్ర రాజధానికి చేరుకునే వీలు కలుగుతుంది.

ఇల్లెందుకు 6.86 కి.మీ. నిడివితో రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ కోసం గతేడాది ఆగస్టులో నోటిఫికేషన్ జారీ అయింది. ఆ తర్వాత మిగిలిన 45 కి.మీ. రోడ్డు కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ వెలువడింది. అప్పటి నుంచి భూ సేకరణపై రెవెన్యూ శాఖ దృష్టి సారించింది. ఇప్పటికే పలు గ్రామాల్లో సభలు జరిగాయి.

అటవీ శాఖ అడుగులు..

కొత్తగూడెం – ఇల్లెందు మార్గంలో బొజ్జాయిగూడెం నుంచి తొమ్మిదో మైలుతండా, అనిశెట్టిపల్లి నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు రిజర్వ్ ఫారెస్ట్ గుండా ఎన్‌హెచ్ 930పీని విస్తరించాల్సి ఉంది. అయితే రోడ్డు విస్తరణ కారణంగా కోల్పోయే స్థలం ఎంత? ఎన్ని చెట్లు నరకాల్సి వస్తుంది వంటి అంశాలను సేకరించేందుకు అటవీ శాఖ రంగంలోకి దిగింది. గుర్తింపు పూర్తయిన తర్వాత ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రాగానే అటవీ శాఖ నుంచి క్లియరెన్స్ వస్తుంది. ఆ వెంటనే రోడ్డు నిర్మాణ పనుల్లో మొదలయ్యే అవకాశముంది.

పట్టుదలతో ఆడితేనే విజయం



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని



- కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని
- బ్యాడ్మింటన్ కోచ్ 'గుజ్జుల' స్మారక పోటీల నిర్వహణ

కొత్తగూడెంటౌన్: క్రమశిక్షణ, కఠినశ్రమతో పాటు పట్టుదల ఉంటేనే ఏ రంగంలో అయినా విజయం సాధించవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గుజ్జుల సుధాకర్ రెడ్డి స్మారకార్థం పట్టణంలోని హనుమాన్ బస్తీ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్, షటిల్ పోటీలను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సుధాకర్‌రెడ్డి స్మారక క్రీడా పోటీలను ఆయన సతీమణి సావిత్రి నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడాకారులు పట్టుదలతో ఆడి విజయం సాధించాలని, తద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈనెల 9వరకు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. బ్యాడ్మింటన్, షటిల్ విభాగాల్లో తొలిరోజు 20 మ్యాచ్‌లు జరిగాయని వివరించారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ యుగంధర్‌రెడ్డి, సెక్రటరీ ఆర్.రాజేందర్, డీవైఎస్ఓ పి.పరంధామరెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇంటూరి రవికుమార్, కె.సావిత్రి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబిర్‌పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, కేటీపీఎస్ సీఈలు ఎం.ప్రభాకర్ రావు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణపై ప్రత్యేక దృష్టి



వెదురు వేలం నిర్వహిస్తున్న ఎఫ్‌డీఓ మంజుల

ఏన్కూరు: అటవీ ప్రాంతాన్ని సంరక్షిస్తూనే జంతువుల వేటను అరికట్టడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎఫ్‌డీఓ మంజుల వెల్లడించారు. ఏన్కూరులోని వెదురు డిపోలో గురువారం జరిగిన వేలం పాటలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున అడవుల్లో అగ్ని ప్రమాదాలకు జరగకుండా పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. వన్యప్రాణుల దాహార్తి తీర్చేలా కుంటల్లో నీరు నింపుతున్నామని చెప్పారు. అలాగే, అటవీ ప్రాంతాల ప్రజలు వేటకు వెళ్లకుండా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు.

'పుష్కర' పూజలు ప్రారంభం



కాలినడకన అమ్మవారికి సారె తీసుకొచ్చిన మహిళలు

- పెద్దమ్మతల్లి ఆలయంలో మహా కుంభాభిషేకం
- కాలినడకన వచ్చి అమ్మవారికి సారె సమర్పించిన భక్తులు



అమ్మవారి సన్నిధిలో పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న పంచమ పుష్కర (షష్టాబ్ది) మహా కుంభాభిషేక పూజలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఖమ్మానికి చెందిన అవధాని శివసంతోష్ శర్మ నేతృత్వంలో 20 మంది రుత్విక్‌లు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మంగళతోరణాలంకరణ, విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచనం, దీక్షాధారణ, రక్షాబంధనం, గోపూజ, అఖండ దీపారాధన, అంకురార్పణ, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. 100 మంది మహిళా భక్తులు పాత పాల్వంచ నుంచి పెద్దమ్మతల్లి ఆలయం వరకు కాలినడకన వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ఈఓ రజనీకుమారి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, స్థానిక భక్తులు నందానాయక్, బండ్లపల్లి వెంకటనారాయణ, చారి, కొండం పుల్లయ్య, వెంకన్న, గంధం వెంగళరావు, నర్సింహారావు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా 'భద్రాచలం'..

- జిల్లాలో పెరిగిన మండల పరిషత్‌లు
- గతంలో 21 ఉండగా ప్రస్తుతం 22 మండలాలు
- అదనంగా పెరిగిన ఎంపీటీసీ స్థానాలు 16..
- జిల్లాలో 22 జెడ్పీటీసీ, 236 ఎంపీటీసీ సీట్లు



భద్రాచలంలో సిద్ధమవుతున్న మండల కార్యాలయం

మంచుపల్లి: పరిపాలన సౌలభ్యం కోసం గత టీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన చేపట్టింది. అలాగే విస్తీర్ణంలో పెద్దవిగా ఉన్న మండలాల పరిధి తగ్గించి కొత్త మండలాలు ఏర్పాటు చేసింది. దీంతో జిల్లాలో కొత్తగా ఆరు మండలాలు ఏర్పాటయ్యాయి. ఇక 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజల అవసరాలు, డిమాండ్ మేరకు గత నవంబర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా మరో 32 కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో జిల్లాకు సంబంధించి ప్రసిద్ధ శ్రీ సీతారామచంద్రస్వామి కొలువుదీరిన భద్రాచలాన్ని పూర్తిస్థాయిలో మండలంగా ప్రకటించగా.. జిల్లాలో మండలాల సంఖ్య 21 నుంచి 22కు చేరింది. భద్రాచలంలో మండల కార్యాలయం ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. పాత ఎంపీడీఓ కార్యాలయానికి మరమ్మతులు చేసి, రంగులు వేస్తున్నారు. ఫర్నిచర్, సిబ్బంది, ఇతర వనరులు సమకూర్చే పనులు సైతం చకచకా జరుగుతున్నాయి. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఒకరికి బాధ్యతలు అప్పగించారు.

ఎంపీటీసీ స్థానాల్లోనూ పెరుగుదల..

భద్రాచలం మండలంగా ఏర్పాటు కావడంతో ఇక్కడ 14 ఎంపీటీసీ స్థానాలు కొత్తగా ఏర్పడ్డాయి. ఇతర మండలాల్లోనూ అనుకూలమైన చోట ఎంపీటీసీ స్థానాలను పెంచుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో బూర్గంపాడు మండలం సారపాకలో ఏకంగా ఆరు, ఆళ్లపల్లి, కరకగూడెంలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 22 ఎంపీటీసీ స్థానాలు అదనంగా ఏర్పాటయ్యాయి. అయితే అశ్వారావుపేట మున్సిపాలిటీగా మారడంతో ప్రస్తుతం ఉన్న 17 ఎంపీటీసీ స్థానాల్లో ఆరు తగ్గాయి. జిల్లాలో ఇప్పటివరకు 220 ఎంపీటీసీ, 21 జెడ్పీటీసీ స్థానాలుండగా, కొత్త వాటిని కలిపితే 22 జెడ్పీటీసీ, 236 ఎంపీటీసీ స్థానాలు అయ్యాయి. ఇక 2019లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 220 ఎంపీటీసీలకు గానూ 52 జనరల్, 45 జనరల్ మహిళ, ఎస్టీ మహిళ 62, ఎస్టీ జనరల్ 56, ఎస్సీ మహిళ 3, ఎస్సీ జనరల్ 2 స్థానాల చొప్పున రిజర్వేషన్లు కేటాయించారు. బూర్గంపాడు మండల పరిషత్‌కు అప్పుడు ఎన్నికలు జరగలేదు. ఇక త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలతో పాటు జెడ్పీ చైర్మన్ పదవికి రిజర్వేషన్లు ఖరారు చేయాల్సి ఉంది.

వివిధ మండలాల్లో ఎంపీటీసీ స్థానాల వివరాలు

ఆళ్లపల్లి	05	గుండాల	05
అన్నపురెడ్డిపల్లి	06	జూలూరుపాడు	10
అశ్వారావుపేట	11	కరకగూడెం	05
అశ్వాపురం	12	లక్ష్మీదేవిపల్లి	11
భద్రాచలం	14	మణుగూరు	11
బూర్గంపాడు	17	ములకలపల్లి	10
చండ్రుగొండ	08	పాల్వంచ	10
చర్ల	12	పినపాక	09
చుంచుపల్లి	12	సుజాతనగర్	08
దమ్మపేట	17	టేకులపల్లి	14
దుమ్ముగూడెం	13	ఇల్లెందు	16

ఈసారి 22 మండలాలకు ఎన్నికలు



జిల్లాలో ప్రస్తుతం 21 మండల పరిషత్‌లు ఉండగా, ఇటీవల భద్రాచలం కొత్తగా ఏర్పడడంతో వాటి సంఖ్య 22కు చేరింది. ఎంపీటీసీ స్థానాలు కూడా భారీగా పెరిగాయి. భద్రాచలంలో మండల వ్యవస్థ ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. అక్కడ ఇప్పటికే ముగ్గురు సిబ్బందితో పాటు ఒకరికి ఎంపీడీఓగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించాం. జిల్లాలోని 22 జెడ్పీటీసీ, 236 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేస్తున్నాం.

– బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ

10న నులిపురుగుల నివారణ దినోత్సవం

విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపు



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈనెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1 నుంచి 19 ఏళ్ల వయసు గల వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందజేయాలని సూచించారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులకు ఈ మాత్రలు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రలతో పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం వంటి సమస్యలు నివారించవచ్చని, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందించవచ్చని అన్నారు. విద్యాశాఖ అధికారులు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థులందరికీ మాత్రలు వేయాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోనూ ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. పిల్లలకు వయసుల వారీగా ఇచ్చే డోసులపై టీచర్లకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. భోజనం తర్వాతే మాత్రలు వేయాలని స్పష్టం చేశారు. 1 – 19 ఏళ్ల వయసు గలవారు జిల్లాలో 3,36,212 మంది ఉన్నారని, ప్రత్యేక షెడ్యూల్ ఏర్పర్చుకుని అందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, డీసీహెచ్ఎస్ రవిబాబు, డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనా, బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు ఇందిర, అనసూయ, డీఐఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ మాత్రలు వేయాలి..



సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: 1– 19 ఏళ్ల మధ్య వయసు గలవారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన పాత కొత్తగూడెంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అందుతున్న వైద్యసేవలపై డాక్టర్ రాకేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు గర్భిణుల వివరాలు నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాంప్రసాద్, హెచ్ఈఓ జయంతి, నర్సింగ్ అధికారి నాగమణి, ఎల్‌టీ కమల తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఆధ్వర్యాన 12న జాబ్ మేళా

భద్రాచలంటౌన్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. మెడ్ ప్లస్, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, శ్రీరామ్ లైఫ్ ఇన్స్‌రెన్స్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఈ మేళాలో ఎంపిక ఉంటుందని వెల్లడించారు. అలాగే, గిరిజన నిరుద్యోగ యువతకు ఐటీసీ ప్రథమం సంస్థ ద్వారా బ్యూటీషియన్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా ఇన్ ఫార్మసీ, డిప్లొమా, పీజీ, బీటెక్ అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈనెల 12న ఉదయం 9 గంటలకు ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీ సెంటర్‌లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని పీఓ సూచించారు. పూర్తి సమాచారం కోసం 81799 25586, 63026 08905 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

అత్యధిక నిధులు కేటాయించండి



సీఎం రేవంత్‌రెడ్డితో ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల ప్రజాప్రతినిధులు

సీఎంను కోరిన గిరిజన ప్రజాప్రతినిధులు

ఇల్లెందు : గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అత్యధికంగా నిధులు కేటాయించాలని గిరిజన ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల గిరిజన ఎమ్మెల్యేలు మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్, చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, విప్ రాంచంద్రనాయక్‌తో కలిసి గురువారం సచివాలంలో ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి బోర్ల మంజూరు, విద్యుత్ సదుపాయం, పోడు భూముల అభివృద్ధికి ప్రత్యేక నిధుల వంటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, మాలోతు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకటరావు, జారె ఆదినారాయణ, మురళీనాయక్ తదితరులు ఉన్నారు. కాగా ఈనెల 10వ తేదీన గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వివరించారు.

క్లుప్తంగా

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ డీడీ

కరకగూడెం: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని భద్రాచలం ఐటీడీఏ డీడీ మణెమ్మ సూచించారు. గురువారం మండల పరిధిలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిని మెరుగుపరచాలని చెప్పారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఆ తర్వాత పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ అశోక్, హెచ్‌ఎం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

ములకలపల్లి: గిరిజనుడిని దూషించిన వ్యక్తిపై గురువారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. చౌటిగూడేనికి చెందిన ఊకే రవి జూనియర్ అడ్వకేట్‌గా ప్రాక్టిస్ చేస్తున్నాడు. ఆదివాసీ సేన రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కూడా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గుర్రాజులుకు సంబంధించిన నివాస స్థల విషయం కోర్టు పరిధిలో ఉంది. ఈ క్రమంలో గుర్రాజులు సోమవారం రవి ఇంటికి వచ్చి వాటర్ ట్యాంక్ ఎక్కి చనిపోతున్నానని బెదిరింపులకు పాల్పడ్డాడు. తన ఇంటి నిర్మాణానికి అడ్డువస్తున్నారని కులం పేరుతో రవిని దూషించాడు. చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డాడు. ఆ తర్వాత గుర్రాజులు భార్య కూడా వచ్చి దూషణకు పాల్పడింది. బాధితుడి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

ఏఆర్ ఎస్సై మృతితో మాణిక్యారంలో విషాదం



సూర్ణపాక లక్ష్మీనర్సు (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని మాణిక్యారం గ్రామానికి చెందిన సూర్ణపాక లక్ష్మీనర్సు (38) గురువారం ములుగు జిల్లా పస్రాలో ఆత్మహత్య చేసుకున్నాడు. కరకగూడెం పోలీసుస్టేషన్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తుండగా, అతని భార్య సునీత పస్రా సమీపంలోని గోవిందరావుపేటలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. బుధవారం పస్రాలోని ఇంటికి వెళ్లిన ఆయన ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మీనర్సు మృతి పట్ల మాణిక్యారం గ్రామపెద్దలు, మాస్‌లైన్ నాయకులు సంతాపం తెలిపారు. ఏఆర్ ఎస్‌ఐ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: రోడ్డు ప్రమాద ఘటనలో ద్విచక్ర వాహనదారుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సోములగూడెం గ్రామానికి చెందిన గద్దల సూర్యానారాయణ ఈ నెల 2న ఇందిరానగర్ కాలనీ పెట్రోల్‌బంక్‌లో ద్విచక్రవాహనంలో పెట్రోల్ పోయించుకుని యూటర్న్ తీసుకుని వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనదారుడు సతీష్ ఢీకొట్టడంతో సూర్యానారాయణకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కుమారుడు శ్రవణకుమార్ ఫిర్యాదుతో సతీష్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కృష్ణ తెలిపారు.

సమస్యలతో సతమతం

ఆవేదన చెందుతున్న జెన్‌కో ఇంజనీర్లు

- అమలుకు నోచుకోని జీపీఎఫ్, పదోన్నతులు, అంతర్గత బదిలీలు
- ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పట్టించుకోని యాజమాన్యం



కేటీపీఎస్ కర్మాగారం

పాల్వంచ: రాష్ట్రానికి వెలుగులు పంచే విద్యుదుత్పత్తి కర్మాగారాల్లో కీలకంగా విధులు నిర్వర్తిస్తున్న ఇంజనీర్ల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఎంతో శ్రమకోర్చి జెన్‌కో సంస్థ అభ్యున్నతికి పాటుపడుతున్నా వారికి వసతీ సౌకర్యాలు మెరుగుపడటం లేదు. అనేక ఏళ్లుగా ఇంజనీర్ల సంఘాలు విన్నవిస్తున్నా జెన్ కో యాజమాన్యం, ప్రభుత్వం పెడచెవిన పెడుతున్నాయి. మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండటం లేదని కేటీపీఎస్, బీటీపీఎస్ కర్మాగారాల్లో పనిచేసే ఇంజనీర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా సమస్యల పరిష్కారం కోసం ఇంజనీర్ల సంఘాల ఆధ్వర్యంలో దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నారు.

ఇవీ సమస్యలు

- 2004 వరకు ఉద్యోగాలు పొందిన ఇంజనీర్లకు ఈపీఎఫ్‌ను జీపీఎఫ్‌గా మార్చాలనే కోరుతున్నారు. పెన్షన్ సౌకర్యం లేకుండానే ఉద్యోగ విరమణ పొందితే తమ పరిస్థితి ఏమిటనే ఆందోళన వారిలో నెలకొంది.
- అన్ని కార్పొరేషన్లలో పాటిస్తున్నా జెన్‌కోలో మాత్రం టైం బాండ్ పదోన్నతులు కల్పించడం లేదు. దీంతో ఉద్యోగులు చనిపోతే, ఉద్యోగ విరమణ పొందితేగానీ పదోన్నతి లభించడం లేదు.
- అంతర్గత బదిలీలు చేయడంలేదు. దీంతో కొందరు ఉద్యోగులు కోల్ ప్లాంట్, బాయిలర్ లాంటి కష్టమైన విభాగాల్లోనే పనిచేస్తుండగా, మరికొందరు పర్చేజ్, ఏడీఎం, స్టోర్స్ లాంటి విభాగాల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్నారు. దీని వల్ల కష్టమైన విభాగాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లు అక్కడే మగ్గిపోతున్నట్లు తెలుస్తోంది.
- ఉచిత వైద్య పరీక్షల కోసం మేనేజ్‌మెంట్ ముందుకు రావడం లేదు. క్రెడిట్ కార్డు స్థానంలో రూ.30 లక్షల వరకు థర్డ్ పార్టీ మెడికల్ ఇన్సూరెన్స్ ఇవ్వాలని కోరుతున్నారు.
- సీనియారిటీ జాబితా, ప్రతి ఇంజనీర్ బదిలీ, ప్రమోషన్, ఖాళీల జాబితా, మంజూరైన పోస్టుల జాబితా తదితర వివరాలు ఉద్యోగి పోర్టల్‌లో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.
- ఇటీవల ఇంజనీర్లకు పదోన్నతులు లభించి, న్యాయపరమైన ఆటంకాలు కూడా తొలగిపోయాయి. దీంతో ఆలస్యం చేయకుండా బదిలీలు చేపట్టాలని వేడుకుంటున్నారు.
- కేటీపీఎస్ కాంప్లెక్స్ పరిధిలో సుమారు 2 వేల మంది ఇంజనీర్లు ఉన్నారు. వీరికి సరైన కమ్యూనిటీ హాల్ లేదు. సరిపడా క్వార్టర్లు లేవు. పాత క్వార్టర్లు శిథిలావస్థకు చేరాయి. కొత్త క్వార్టర్లను నిర్మించాలని కోరుతున్నారు. ఇప్పటికే ఓఅండ్‌ఎం కర్మాగారం తొలగింపుతో వేలాది మంది ఉద్యోగులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. రానున్న రోజుల్లో 800 మెగావాట్ల కర్మాగారాలు రెండు నిర్మించాలని కోరుతున్నారు.

ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలి



ఇంజనీర్ల సమస్యలు పరిష్కరించాలని ఏళ్లుగా కోరుతున్నాం. బదిలీలు, పదోన్నతులు, జీపీఎఫ్ సాధించాల్సి ఉంది. సమస్యలను యాజమాన్యం, మంత్రుల దృష్టికి తీసుకెళ్లాం. రానున్న రోజుల్లో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

–ఎండీ.సమీర్, తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ సెక్రటరీ

ఇంజనీర్లు ఎంతో కీలకం



విద్యుత్ సంస్థ మనుగడలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకం. బదిలీలు చేపట్టాలని, కేటీపీఎస్ కాంప్లెక్స్‌లో మరో రెండు పవర్ ప్లాంట్‌లు నిర్మాణం చేపట్టాలని కోరుతున్నాం. ఈపీఎఫ్ సమస్యను పరిష్కరించాలి.

–డి.ఉమా మహేశ్వరరావు, టీవీపీఈఏ బ్రాంచ్ సెక్రటరీ, కేటీపీఎస్ 5,6 దశలు

క్రీడలతో మానసికోల్లాసం

స్పోర్ట్స్ మీట్‌లో ఎస్పీ రోహిత్‌రాజ్



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో ఎస్పీ

కొత్తగూడెంఅర్బన్ : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. హేమచంద్రపురంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో గురువారం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్–2025 ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ శాఖ విభాగాల వారీగా చేసిన పరేడ్‌ను తిలకించారు. అనంతరం క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం విధి నిర్వహణలో ఒత్తిడిని ఎదుర్కొనే సిబ్బందికి ఆట విడుపు కోసం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, కబడ్డీ, షటిల్ బాడ్మింటన్, అథ్లెటిక్స్, పరుగు పందెం తదితర పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత హోంగార్డ్స్ టీమ్, పాల్వంచ సబ్ డివిజన్ మధ్య జరిగిన వాలీబాల్ మ్యాచ్‌ను టాస్ వేసి ఎస్పీ ప్రారంభించారు. క్రికెట్ మ్యాచ్‌లో కొద్ది సేపు బౌలింగ్ చేసి సిబ్బందిని ఉత్సాహపరిచారు. భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో రాజకీయ జోక్యం..

సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని, సంస్థ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవాధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బాబుక్యాంపులోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ పరిరక్షణ, కార్మిక హక్కుల సాధనకు ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ జోక్యంతో లాభాలే లక్ష్యంగా సోలార్, విండ్‌పవర్, ఐరన్‌ఓర్ ఉత్పత్తులపై దృష్టిపెట్టి, ఇతర రాష్ట్రాల్లో కూడా వాణిజ్యపరంగా ఆసక్తి చూపుతూ సింగరేణి ఉనికిని యాజమాన్యం కనుమరుగు చేస్తోందని దుయ్యబట్టారు. సింగరేణి సంస్థకు వచ్చే నిధులు ఎంత, ఎలా ఖర్చు పెడుతున్నారనే వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచకుండా, జీఓ 22ను అమలు చేయకుండా చట్టబద్ధమైన శ్రమదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణిని ప్రైవేట్‌పరం చేసే విధానాలను అవలంబిస్తోందని అన్నారు. సింగరేణి సంస్థకు ప్రభుత్వం రూ. 33 వేల కోట్ల అప్పు ఉందని అన్నారు. సింగరేణిలో అవినీతి పెరిగిందని ఆరోపించారు. గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ సింగరేణి త్రిశంకు స్వర్గంలో ఉందని అన్నారు. ఒకే డైరెక్టర్ ఉన్నారని, మిగిలిన డైరెక్టర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో పాలన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి ఏడాది కావొస్తున్నా ఇప్పటివరకు సీఎండీ స్థాయి సమావేశం జరగకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ నాయకులు, వివిధ బ్రాంచి కార్యదర్శులు కె.రాజ్‌కుమార్, ఎం.వెంకటస్వామి, మిర్యాల రంగయ్య, కె.సారయ్య, వైవీ రావు, వంగా వెంకట్, మల్లికార్జునరావు, జి.వీరాస్వామి, రమణమూర్తి, నజీర్ అహ్మద్, పోశం రవీందర్, కిషన్‌రావు పాల్గొన్నారు.

బతికున్న వ్యక్తికి డెత్ సర్టిఫికెట్ !

బీమా సొమ్ము కాజేసిన పాలసీదారుడు, ఎల్‌ఐసీ ఏజెంట్

బూర్గంపాడు: కంచే చేను మేసిన చందంగా ఎల్‌ఐసీ ఏజెంటే నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి బతికున్న వ్యక్తికి బీమా సొమ్ము ఇప్పించాడు. అందులో అగ్రభాగం తాను తీసుకుని సహకరించిన వారికి కొంత ముట్టజెప్పిన ఘటన బూర్గంపాడు మండలం సారపాకలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సారపాకలోని భాస్కర్‌నగర్‌కు చెందిన భూక్యా శ్రీరాములు పేరున ఓ ఎల్‌ఐసీ ఏజెంట్ జీవిత బీమా చేయించాడు. కాగా, ఆరు నెలల క్రితం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన మరో ఏజెంట్.. శ్రీరాములు, మరో వ్యక్తితో కలిసి బీమా సొమ్ము కాజేసేందుకు పథకం రచించాడు. శ్రీరాములు మరణించినట్లు ఆంధ్రప్రదేశ్‌లోని కుక్కునూరు నుంచి నకిలీ డెత్ సర్టిఫికెట్ సంపాదించారు. డెత్ సర్టిఫికెట్, బీమా సొమ్ము అందించాల్సిన నామినీ వివరాలను భద్రాచలంలోని ఎల్‌ఐసీ బ్రాంచ్‌లో అందజేశారు. దీంతో ఎల్‌ఐసీ అధికారులు రూ.10 లక్షల బీమా చెక్కును శ్రీరాములు కుటుంబానికి రెండు నెలల క్రితం అందించారు. అందులో రూ. 5.50 లక్షలు ఎల్‌ఐసీ ఏజెంట్, రూ. 3.50 శ్రీరాములు కుటుంబం, మరో రూ.లక్ష సహకరించిన వ్యక్తి పంచుకున్నారు. అయితే ఈ వ్యవహారంపై కొంతమేర సమాచారం తెలిసిన వ్యక్తి.. తనకు డబ్బులు ఇవ్వకపోవడంతో విషయాన్ని బయటపెట్టినట్లు తెలుస్తోంది. దీంతో ఎల్‌ఐసీ అధికారులు గురువారం శ్రీరాములు ఇంటికి వెళ్లగా అతడు బతికే ఉండడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. వెంటనే భద్రాచలంలోని ఎల్‌ఐసీ కార్యాలయానికి తీసుకెళ్లి విచారణ చేపట్టారు. కాగా, సాయంత్రానికి ఈ ముగ్గురి నుంచీ రూ. 10 లక్షలు రికవరీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై ఎల్‌ఐసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది.

నేనసలు ఎల్‌ఐసీ కట్టనేలేదు..

భాస్కర్‌నగర్‌కు చెందిన భూక్యా శ్రీరాములు పేరున ఏడేళ్ల క్రితం నుంచి జీవిత బీమా చెల్లిస్తున్నారు. రూ.10 లక్షలకు బీమా చేసి ప్రతి ఏటా రూ. 25 వేలు ప్రీమియం చెల్లిస్తున్నారు. అయితే తాను ఇంతవరకు ఎల్‌ఐసీ చేయలేదని, తన పేరున ఎవరు ఎల్‌ఐసీ చేశారో, ప్రీమియం ఎవరు చెల్లిస్తున్నారో తనకు తెలియదని శ్రీరాములు చెప్పినట్లు సమాచారం. ఏదో డబ్బులు వస్తాయంటే తాను ఈ పనికి ఒప్పుకున్నట్లు అంగీకరించాడని తెలిసింది. అయితే పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అసలు విషయాలు బయటకు వస్తాయనే చర్చ జరుగుతోంది.

ఇసుక క్వారీల్లో తనిఖీలు

- మైనింగ్ అధికారుల గోప్యతపై పలు అనుమానాలు

చర్ల: మండలంలోని మొగళ్లపల్లి, వీరాపురం ఇసుక క్వారీలను గురువారం మైనింగ్ శాఖ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఇసుక క్వారీల నుంచి ఓవర్ లోడులతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు ఓవర్‌లోడ్‌లతో వెళ్తున్న ఇసుక లారీలను పట్టుకుని కేసులు కూడా నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలిసింది. క్వారీల్లో ఇసుక తవ్వకం, లోడింగ్‌పై అధికారులు ఆరా తీసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఇసుక తవ్వకం, తరలింపునకు నిబంధనలు సడలిస్తున్న నేపథ్యంలో గిరిజనులకు ఏ విధంగా లబ్ధి చేకూరుతుందనే విషయాలపై కూడా వివరాలు సేకరించినట్లు తెలిసింది. తనిఖీలు నిర్వహించినా సమాచారం బయటకు పొక్కకుండా మైనింగ్ అధికారులు గోప్యత పాటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా మైనింగ్ శాఖ పీఓను ఫోన్‌లో సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించినా.. వారు స్పందించలేదు.

పీఏసీఎస్ చైర్మన్‌కు అనారోగ్యం

జైలు నుంచి ఆస్పత్రికి తరలింపు



ఆస్పత్రి నుంచి అధిష్ఠానంతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: రైతులకు నకిలీ మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేశారనే అభియోగం ఎదుర్కొంటున్న టేకులపల్లి మండలం బేతంపూడి పీఏసీఎస్ చైర్మన్, బీఆర్‌ఎస్ నాయకుడు లక్కినేని సురేందర్‌ను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసి ఇల్లెందు సబ్ జైలుకు తరలించిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన బుధవారం రాత్రంతా కడుపు నొప్పి, విరోచనాలతో బాధపడుతూ డీ హైడ్రేషన్‌కు గురయ్యారు. దీంతో జైలు అధికారులు న్యాయమూర్తికి సమాచారం ఇచ్చి ఆయన ఆదేశాలతో ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ఈ విషయం తెలియడంతో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, దిండిగాల రాజేందర్, దాస్యం ప్రమోద్ కుమార్ తదితరులు ఆస్పత్రికి చేరుకున్నారు. కాగా, గురువారం మధ్యాహ్నం వరకు సురేందర్ ఆరోగ్యం కుదుటపడటంతో తిరిగి సబ్ జైలుకు తరలించారు. ఈ మేరకు వివరాలను మాజీ ఎమ్మెల్యే హరిప్రియ ఎప్పటికప్పుడు బీఆర్‌ఎస్ అధిష్ఠానానికి వివరించారు. కాగా, జైలులో ఖైదీలే స్వయంగా వంటలు తయారు చేస్తుండగా కూరలో కారం ఎక్కువవడంతో అనారోగ్యం పాలైనట్లు ఆయన తెలిపారని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి

కారేపల్లి: ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో యువకుడు మృతి చెందిన ఘటన కారేపల్లి మండలం పేరుపల్లి–జమాళ్లపల్లి మధ్య బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఇల్లెందు మండలం చల్లసముద్రం గ్రామపంచాయతీ వేములవాడకు చెందిన కల్తి విజయ్(30) ద్విచక్రవాహనంపై బుధవారం రాత్రి పేరుపల్లి వైపు వస్తుండగా మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న ఫెన్సింగ్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా, కుటుంబీకుల ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు కారేపల్లి ఎస్‌ఐ ఎన్.రాజారాం తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి...

అశ్వారావుపేటరూరల్: పురుగుల మందు తాగిన యువతి గురువారం మృతి చెందింది. ఏఎస్సై పడాల వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట గ్రామానికి చెందిన సోయం శిరోమణి(19) ఇంట్లో పనులు చేయడం లేదని తల్లి రత్తమ్మ మందలించింది. దీంతో మనస్తాపం చెంది గత నెల 15న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబీకులు అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు గత నెల 27వ తేదీ వరకు చికిత్స అందించి ఇంటికి పంపించారు. యువతి ఈ నెల 1న మళ్లీ అనారోగ్యానికి గురికావడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్న క్రమంలోనే పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం, మాయం.. ఆపై జరిమానా

ములకలపల్లి రెవెన్యూలో వింతలీలలు

ములకలపల్లి: తహసీల్ ఆవరణ నుంచి మాయమైన ట్రాక్టర్‌కు రూ. 5వేలు జరిమానా విధించడం విస్మయానికి గురిచేస్తోంది. గత నెల 17న మండల పరిధిలోని మూకమామిడి గ్రామ శివారులో ఇసుక తోలుతుండగా గిర్దావర్–2 భద్రు తనిఖీలు చేపట్టి ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని, తహసీల్‌కు తరలించారు. ఆ తర్వాత ట్రాక్టర్ అదృశ్యమైనట్లు గుర్తించిన తహసీల్దార్ గత నెల 20న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ట్రాక్టర్ మాయంపై అదే నెల 30న 'ఆ ట్రాక్టర్ ఏమైంది' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీంతో అదేరోజు ట్రాక్టర్‌కు రూ.5 వేలు జరిమానా చెల్లించడం గమనార్హం. అయితే రెవెన్యూ అధికారుల ప్రమేయం లేకుండా జరిమానా ఎలా చెల్లించారనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. జనవరి 20న ట్రాక్టర్ మాయమైందని ఫిర్యాదు చేశామని చెబుతున్న రెవెన్యూ అధికారులు ఆ తర్వాత జరిమానా ఎలా విధించారనేది సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది.

దీనిపై తహసీల్దార్ గుడ్ల పుల్లారావును వివరణ కోరగా.. చలానా కట్టినట్లు గురువారమే తన దృష్టికి వచ్చిందని తెలిపారు. సదరు ట్రాక్టర్‌కు జనవరి 30న ఫైన్ చెల్లించి, తమ కార్యాలయ సిబ్బందికి అందజేశారని, విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఖమ్మం మార్కెట్ కళకళ

- విక్రయానికి 70 వేల బస్తాల మిర్చి
- ధరలో కానరాని పురోగతి



మిర్చి బస్తాలతో నిండిన యార్డు

ఖమ్మంవ్యవసాయం: మిర్చి బస్తాలతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కళకళలాడింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాల నుంచే కాక ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు 70 వేల బస్తాల మిర్చిని తీసుకురావడంతో మార్కెట్‌లోని షెడ్లే కాక యార్డులన్నీ నిండిపోయాయి. మిర్చి రెండో కోతలు జోరుగా సాగుతుండడంతో విక్రయాలు పెరిగినట్లు చెబుతున్నారు.

నాణ్యత ఉన్నా అంతే...

ప్రస్తుతం రెండో కోత మిర్చి నాణ్యత ఉండడంతో మెరుగైన ధర లభిస్తుందని రైతులు ఆశించారు. కానీ గురువారం మిర్చి జెండా పాటలో క్వింటాకు రూ.14,025 ధర పలకగా, మోడల్ ధర రూ.13,700, కనిష్ట ధర రూ.6వేలుగానే నమోదైంది. మార్కెట్‌కు తీసుకొచ్చిన 70వేల బస్తాల మిర్చిలో అత్యధికంగా మోడల్ ధరతోనే కొనుగోళ్లు చేపట్టారు. ఇక నిల్వ మిర్చికి రూ.6వేల నుంచి రూ.13,300 ధర, తాలు మిర్చికి గరిష్టంగా రూ.6,900 ధర పలికింది. గత ఏడాది రెండో కోత మిర్చికి రూ.20వేలకు పైగా ధర లభిస్తే ఇప్పుడు రూ.14వేలుగానే ఉండడం.. ఇది గత ఏడాది తాలు మిర్చికి వచ్చిన ధరే కావడం గమనార్హం.

కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నా..

దేశ, విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారులు మిర్చి కొనుగోళ్లకు ఆసక్తి కనబరుస్తున్నారు. నాణ్యమైన పంట కావడంతో విదేశాల ఆర్డర్లు తీసుకుని కొనుగోలు చేస్తున్నా డిమాండ్ అంతగా లేదని చెబుతూ ధర మాత్రం పెంచడం లేదు. మరోపక్క ఓ ధర నిర్ణయించి కాంటా సమయాన తేమ, తాలు పేరిట క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు తగ్గించి రైతులను దగా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈవిషయమై పలువురు ఫిర్యాదు చేయడంతో మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, ఉన్నత శ్రేణి కార్యదర్శి పి ప్రవీణ్‌కుమార్, గ్రేడ్–2, కార్యదర్శి వి.సుజన్‌బాబు, సహాయ కార్యదర్శి వీరాంజనేయులు తదితరులు గురువారం సాయంత్రం వ్యాపార ప్రతినిధులతో చర్చించి సూచనలు చేశారు.

గిట్టని వ్యక్తిని పోలీసులకు పట్టించాలని పథకం

జిలెటిన్ స్టిక్స్‌తో వెళ్తుండగా అరెస్ట్



నిందితుడు, జిలిటిన్ స్టిక్స్‌తో పోలీసులు

ఏన్కూరు: ఎవరిపైన అయినా కోపం ఉంటే గొడవ పెట్టుకోవడం, ఘర్షణ పడేవారిని మనం చూస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం జిలెటిన్ స్టిక్స్‌ను సదరు వ్యక్తి ఇంట్లో పెట్టి పోలీసులకు పట్టించాలని పథకం పన్నగా.. స్టిక్స్ తీసుకెళ్తున్న వ్యక్తే పోలీసులకు చిక్కాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తమేడేపల్లికి చెందిన కొరసం రమేష్‌కు గ్రామానికే చెందిన గంగరాజుతో గొడవలు ఉన్నాయి. దీంతో గంగరాజును పోలీసులకు పట్టించాలని నిర్ణయించుకున్న రమేష్ జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లను ఆయన ఇంట్లో పెట్టేందుకు సిద్ధమయ్యాడు. వీటిని కొనుగోలు చేసి ద్విచక్రవాహనంపై వస్తుండగా మండలంలోని జన్నారం క్రాస్ వద్ద వద్ద గురువారం చేపట్టిన తనిఖీల్లో పోలీసులు గుర్తించారు. ఈమేరకు రమేష్‌ను విచారించగా విషయం చెప్పడంతో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుని ఆయనను రిమాండ్ తరలించారు. తనిఖీల్లో ఎస్‌ఐ రఫీ, హెడ్ కానిస్టేబుల్ కొండయ్య, ఉద్యోగులు రవి, సైదా పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక ఆత్మహత్య

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడుకు చెందిన వివాహిత అయిలూరి శ్రీలత(33) ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం ఉదయం కడుపునొప్పి అధికమవడంతో భరించలేక ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. శ్రీలత తండ్రి శీలం బ్రహ్మానందరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.